





రైలు నుండి జారి పడి వ్యక్తి మృతి


పాయకరావుపేట : పట్టణంలో గల నాగరాజుపేటకు చెందిన పోకలకారి అనిల్‌కుమార్ (33) అనే వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు తుని రైల్వే పోలీసు ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫంక్షన్‌కు గుడివాడ వెళ్ళి తిరుగు ప్రయాణంలో రత్నాచల్ రైల్లో వస్తూ తుని రైల్వేస్టేషన్ సమీపాన గల హంసవరం వద్ద రైలు నుంచి జారిపడి అనిల్‌కుమార్ మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హెచ్‌ఐవీ బాధితులకు పోషకాహారం పంపిణీ

నక్కపల్లి: హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష తగదని వారికి మనోధైర్యం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. శుక్రవారం మండలంలో హెచ్‌ఐవీ బాధితులకు ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, లింక్‌వర్కర్స్ స్కీము ఆధ్వర్యంలో పోషకాహారం(నిత్యావసర వస్తువులు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధితులను ఉద్దేశించి మాట్లాడుతూ హెచ్‌ఐవీ నివారణకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు, ఏరియా ఆస్పత్రిల్లో పరీక్ష కేంద్రాలు, ఖరీదైన మందులు అందుబాటులో ఉంచిందన్నారు. వీటిని వాడడం ద్వారా రోగనిరోధక శక్తిని జీవాయుష్షును పెంచుకోవచ్చన్నారు. అపోహను తొలగించుకోవాలని నిర్భయంగా పరీక్షలు చేయించుకోవాలని నక్కపల్లి ఆస్పత్రి ఐసిటిసి కౌన్సిలర్ రమణమ్మ సూచించారు.

పాడి పశువులకు టీకాలు వేయించాలి

కోటవురట్ల: పాడి పశువులకు సీజనల్‌గా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరక్టర్ సింహాద్రప్పడు అన్నారు. అక్కాహేబుపేటలో పశు వైద్యాధికారి డాక్టర్ హరిప్రియ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు అనేక రాయితీలు కల్పించడమే కాకుండా ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నట్టు తెలిపారు. ఈ శిబిరంలో 16 చూడి పరీక్షలు, 14 గర్భవాతం, 27 ఎదకు రాని పశువులకు చికిత్స అందించినట్టు తెలిపారు.















30న మునగపాకలో రక్తదాన శిబిరం

మునగపాక : ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ జన్మదినం సందర్భంగా ఈ నెల 30న భారీ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సచివాలయ కన్వీనర్ దాసరి అప్పారావు తెలిపారు. శుక్రవారం మునగపాక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఎంతో మందికి ప్రాణదాతలుగా నిలుస్తారన్నారు. యువకులు ప్రతి ఆరునెలల కొకసారి రక్తదానం చేయడం ఆరోగ్యానికి మంచిదన్నారు. మునగపాకలో నిర్వహించే రక్తదాన శిబిరం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డేడ అభిమానులు బొడ్డేడ శ్రీనివాసరావు, నరాలశెట్టి సూర్యనారాయణ, దొడ్డి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను రైతులు వినియోగించుకోవాలి

రాంబిల్లి : సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సహాయ సంచాలకులు డాక్టర్ విశాలాక్షి అన్నారు. శుక్రవారం హరిపురం బీసీటీ కేవీకేలో కేవీకే శాస్త్రీయ సలహా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విశాలాక్షి అధికారులు, రైతులనుద్దేశించి మాట్లాడారు. సాంకేతికతను రైతులు అందిపుచ్చుకునేలా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు కృషి చేయాలన్నారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పరిశోధన సంచాలకుడు డాక్టర్ జగన్నాథరావు, కేవీకే చైర్మన్ బి. శ్రీరామ్మూర్తి, చింతపల్లి పరిశోధన స్థానం విస్తరణ శాస్త్రవేత్త కదిరి మోహన్, చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్, కొక్కిరాపల్లి నువ్వుల పరిశోధన స్థానం శాస్త్రవేత్త తులసి లక్ష్మి, ఏరువాక కేంద్రం సమన్వయ కర్త ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

గౌతమ పఠన మందిరం సేవలు అభినందనీయం

మునగపాక : విద్యాభివృద్ధికి గౌతమపఠన మందిరం సేవలు అభినందనీయమని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కొనియాడారు. గౌతమ పఠన మందిరం వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పలు ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన గురువారం రాత్రి బహుమతులు అందజేశారు. పఠన మందిరం అధ్యక్షుడు దాడి సూరిబాబు, కార్యదర్శి వెలగా శ్రీనివాసరావు,సర్పంచ్ దిమ్మల అప్పారావు,ఎంపీటీసీ సూరిశెట్టి రాము,మందిర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.









గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.





సంక్షేమ పథకాల అమలులో వివక్షకు తావులేదు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని వెదురువాడలో ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు రాజు) శుక్రవారం లబ్ధిదారులకు ఓటీఎస్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన వెదురువాడ ఆర్అండ్ఆర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి వివక్ష ఉండదన్నారు. ఈ సందర్భంగా ఆర్అండ్ఆర్ కాలనీలో జాగారపు వరహాలమ్మ దీనస్థితిని తెలుసుకొని రూ.పది వేలు సాయం అందజేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, జెడ్పీటీసీ రాంబాబు, కోఆప్షన్ సభ్యుడు కుమార్, మండల పార్టీ నాయకులు బుజ్జి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శంకర్ రావు, పార్టీ అధికార ప్రతినిధి పిన్నంరాజు వాసు, విమలనాయుడు పాల్గొన్నారు.


వెదురువాడలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

పంచాయతీరాజ్ అధికారికి ఎమ్మెల్యే అభినందన

అచ్యుతాపురం (అనకాపల్లి) : రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీరాజ్ ఇంజినీర్‌గా అవార్డు పొందిన డి. వీరభద్రరావుకు ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) శుక్రవారం అభినందించారు. ఈ మేరకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లాలం రాంబాబు, మండల పార్టీ నాయకులు కోన బుజ్జి, దేశంశెట్టి శంకర్‌రావు, పిన్నంరాజు వాసు పాల్గొన్నారు.

















